www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 237 హైదరాబాద్ శనివారం 20-12-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు



# హరీశ్‌రావు ఔదార్యం

**ఇంటిని తాకట్టు పెట్టి వైద్య విద్యార్థినికి సాయం**

**రూ.20 లక్షల విద్యారుణం మంజూరు చేయించిన హరీశ్**

**ప్రజల మనసుకు దగ్గరైన మాజీ మంత్రి**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాజకీయ నాయకులు సామాన్యంగా పేద విద్యార్థులకు సాయం చేయడం చూస్తూనే ఉంటాం. కానీ, ఒక విద్యార్థిని భవిష్యత్తు కోసం సొంత ఇంటినే బ్యాంకులో తనఖా (మార్టిగేజ్) పెట్టడం అరుదైన సంఘటన. అలాంటి పెద్ద మనసు చాటుకున్నారు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కీలక నాయకుడు, సిద్దిపేట్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు.

పీజీ వైద్యవిద్య (పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సు) చదువుతున్న మమత అనే పేద విద్యార్థినికి ఏటా రూ.7.50 లక్షల ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది. మూడు సంవత్సరాల కోర్సు కాబట్టి మొత్తం భారీ మొత్తం అవసరం. మమత తండ్రి కొంక రామచంద్రం సిద్దిపేట్‌లో టైలర్‌గా పని చేస్తారు. కుటుంబం ఆర్థికంగా బలహీనం కావడంతో, ఆస్తులు ఏమీ లేవు. విద్యారుణం కోసం బ్యాంకుకు వెళ్లగా, ఏదైనా ఆస్తిని తనఖా పెడితేనే రుణం మంజూరు చేస్తామని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. ఈ సమస్యను మమత, ఆమె తండ్రి రామచంద్రం హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఫీజు చెల్లింపు గడువు డిసెంబర్ 18తో ముగిసిపోతుంది కాబట్టి తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న హరీశ్‌రావు క్షణం ఆలోచన చేయకుండా స్పందించారు. సిద్దిపేట్‌లోని తన సొంత ..మిగతా 2లో

# దమ్ముంటే వారితో రాజీనామా చేయించు

## రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్..

**ఫిరాయింపు ఎమ్మెల్యేలు గబ్బిలాల్లా వేలాడుతున్నారు..**

**పదవుల కోసం ఇంత దిగజారుతారా?: కేటీఆర్**

**ఐదు నిమిషాల్లోనే మాట మార్చిన రేవంత్..**

**ఆ 66 శాతం నమ్మకముంటే ఎన్నికలకు రా!**

**స్పీకర్ ముంగట పచ్చి అబద్ధాలా? కడియం, పోచారం, పార్టీ మారిన ఎంఎల్యేల తీరుపై విమర్శలు.**

**అమ్ముడుపోయిన ఎమ్మెల్యేల బతుకులు ఆగమైపోయాయి.. కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు.**

**పంచాయితీ ఎన్నికలలో కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టిన ప్రజలు..**

**సిరిసిల్లలో 80 పంచాయతీల్లో గులాబీ జెండా ప్రభంజనం**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నరని చెప్పుకుంటున్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, నైతికత ఉంటే బీఆర్ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) బహిరంగ సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏవైపు ఉన్నారో నిర్ణయిస్తారని, దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని కెటిఅర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను, ఫిరాయింపు ఎమ్మెల్యేల ద్వంద్వ వైఖరిని కేటీఆర్ తనదైన ..మిగతా 2లో



# పీఏసీఎస్, డీసీసీబీల పాలకవర్గాలు రద్దు

**పర్సన్ ఇన్ చార్జీల నియామకం**

**పీఏసీఎస్ సంఘాల రీ-ఆర్గనైజ్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఆధారంగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పీఏసీఎస్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల డీసీసీబీలు పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 904 పీఏసీఎస్ సంఘాలు, ..మిగతా 0లో

# ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నాం




**ప్రజావాణి రెండేండ్లు పూర్తి చేసుకున్నది**

**74 శాతం ఫిర్యాదులు పరిష్కరించాం**

**ప్రత్యేక సాఫ్ట్ వేర్‌తో సమస్యలు రికార్డ్**

**విపక్షాల ఆరోపణలు అర్థరహితం**

**బీఆర్ఎస్, బీజేపీ ప్రజలకు దూరమయ్యాయి**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల నుంచి నేరుగా స్వీకరించే ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం అందించడమే లక్ష్యంగా ..మిగతా 2లో

# విపక్ష ఎంపీలతో మోడీచాయ్ పే చర్చ

**ఎంపీలకు స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు**

**కార్యక్రమంలో పాల్గొన్న మోడీ, విపక్ష ఎంపీలు**

**ప్రశాంత వాతావరణంలో సాగిన మీటింగ్**

**ఇటీవల పార్లమెంటులో విపక్షల నిరసనలు**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. సమావేశాల నిరవధిక వాయిదా అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు తేనీటి విందు ..మిగతా 3లో

# 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

**భారీగా ఆయుధాల అప్పగింత**

**సీఎం రేవంత్ పిలుపు మేరకు నిర్ణయం**

**అజ్ఞాతంలో ఉన్నవారు కూడా జన జీవనంలోకి రండి**

**ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాలను ఉపయోగించుకోండి**

**డీజీపీ శివధర్ రెడ్డి సూచన**



03



03

# ఏకగ్రీవమైతే అది కాంగ్రెస్ గెలుపా?

గతంలో 163 సర్పంచ్ స్థానాలు.. ఇప్పుడు వెయ్యికి పైగా గెలుపు

1200 మందికి పైగా ఉప సర్పంచ్ స్థానాలు గెలిచాం

10 వేలకు పైగా వార్డుల్లో విజయం సాధించాం

కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెబుతారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

# వార్డు డీలిమిటేషన్ కు లైన్ క్లియర్?

**తొలగిన అన్ని రకాల అడ్డంకులు**

**ఫైనల్ నోటిఫికేషన్ రెఢీ**

**నేడో, రేపో జారీ చేసే అవకాశం**

**ఆ నలుగురికి మాత్రమే**

**మ్యాప్ లు, జనాభా లెక్కలివ్వాలని కోర్టు ఆదేశం**




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తాజాగా రూపాంతరం చెందిన జీహెచ్ఎంసీ పరిధిని 300 మున్సిపల్ వార్డులుగా డీలిమిటేషన్ చేసే ప్రక్రియకు దాదాపు లైన్ క్లియర్ అయినట్టేనని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పాత జీహెచ్ఎంసీ పరిధిలోకి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ..మిగతా 2లో

# ఉద్యోగ నియామకాల్లో నిజాయితీ అవసరం

**పబ్లిక్ సర్వీస్ కమిషన్లు బాధ్యతతో వ్యవహరించాలి**

**ఉద్యోగాల భర్తీలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దు**

**ప్రపంచస్థాయి సివిల్ సర్వెంట్లను తయారు చేయాలి**

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం రామోజీ ఫిల్మ్ సిటీలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగ నియామకాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అభ్యర్థుల నిజాయతీ, సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "నిజాయతీ, సమగ్రత అత్యంత కీలకమైనవి, వీటిపై ఎలాంటి రాజీ లేకూడదు" అని ఆమె నొక్కి చెప్పారు. రాష్ట్రపతి మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాతలు సేవలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు ప్రత్యేక భాగాన్ని కేటాయించారని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఈ విషయంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పబ్లిక్ సర్వీస్ ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం




ఐమాక్స్ లో లాంచనంగా ప్రారంభించిన ప్రభుత్వం

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ఈ నెల 21 వరకు కార్యక్రమం నిర్వహణ

యువ ప్రతిభకు పురస్కారాలు

03

# వార్డు డీలిమిటేషన్ కు లైన్ క్లియర్?

మొదటిపేజీ తరువాయి

పరిధిలోని 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయటంతో వార్డుల డీలిమిటేషన్ అనివార్యమైన నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన డీలిమిటేషన్ డ్రాఫ్ట్ ను జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్ మరుసటి రోజు అంటే 10వ తేదీ నుంచి డీలిమిటేషన్ పై ప్రజల నుంచి అభ్యంతరాలను, సలహాలను స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై నలుగురు వ్యక్తులు హై కోర్టును ఆశ్రయించటంతో హై కోర్టు అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు రెండు రోజుల గడువు పెంచటంతో బుధవారంతో ముగియాల్సిన స్వీకరణ గురువారం కూడా కొనసాగింది. గురువారం సాయంత్రం వరకు జీహెచ్ఎంసీ సర్కిల్, జోన్, ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పెషల్ కౌంటర్లు మొత్తం 5905 అభ్యంతరాలు, సలహాలను స్వీకరించినట్లు తెలిసింది. గురువారం జీహెచ్ఎంసీ కూడా పిటిషన్లను సవాలు చేయటంతో శుక్రవారం కూడా విచారించిన కోర్టు పిటిషన్లు దాఖలు చేసిన నలుగురికి డీలిమిటేషన్ మ్యాప్ లు, వార్డుల జనాభా లెక్కలను సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో వార్డు డీలిమిటేషన్ కు ఇప్పటి వరకు ఎదురైన వివిధ రకాల అడ్డంకులు దాదాపు తొలగి లైన్ క్లియర్ అయిందని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కోర్టును ఆశ్రయించిన నలుగురు పిటిషన్లకు వారు కోరిన విధంగా డీలిమిటేషన్ మ్యాప్ లు, వార్డుల వారీగా జనాభా లెక్కలను సమర్పించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిసింది. ఆ తర్వాతే డీలిమిటేషన్ ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. వార్డుల డీలిమిటేషన్ కు సంబంధించి ఇప్పటి వరకు స్వీకరించిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని స్వల్ప మార్పులను డ్రాఫ్ట్ ను సర్కారుకు పంపనున్నారు. సర్కారు అనుమతి తీసుకున్న తర్వాత శనివారం గానీ, సోమవారం గానీ చేసే ఫైనల్ నోటిఫికషన్ జారీ చేసే అవకాశాలున్నాయి.

**చేయనున్న మార్పులు కొన్ని**

వార్డుల డీలిమిటేషన్ కు సంబంధించి ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతరాల మేరకు డ్రాఫ్ట్ లో స్వల్ప మార్పులు చేయనున్నారు. ముఖ్యంగా డ్రాఫ్ట్ లో పాత బాగ్ అంబర్ పేట వార్డు పేరు డీడీ కాలనీగా అధికారులు పేర్కొన్న, ఆ వార్డు పేరు బాగ్ అంబర్ పేటగానే మార్చనున్నారు. దీనికి తోడు మోండా వార్డు పేరు కూడా యథావిధిగా కొనసాగించనున్నారు. దీంతో పాటు బీహెచ్ఎంసీలో ఒక వార్డుకు సంబంధించి కార్పొరేటర్ సింధు కౌన్సిల్ లో చేసిన అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకుని మార్పులు చేయనున్నారు.

**రిజర్వేషన్ల ఖరారే తదుపరి ప్రక్రియ**

జీహెచ్ఎంసీ పంపనున్న వార్డుల డీలిమిటేషన్ ఫైనల్ నోటిఫికేషన్ సర్కారు ఆమోదించిన వెంటనే సర్కారు ఆదేశాల మేరకు అధికారులు వార్డుల వారీగా జనాభాను లెక్కలేసి ఆయా సామాజికవర్గాల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు తెలిసింది. వార్డుల డీలిమిటేషన్ చేసిన జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఎన్నికల సంఘం అధికారులు వార్డుల వారీగా జనాభా లెక్కలను సేకరించి, అత్యధికంగా ఉన్న సామాజికవర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మహిళా జనరల్ తదితర క్యాటగిరీలుగా రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రిజర్వేషన్లకు సంబంధించి కూడా డ్రాఫ్ట్ రూపకల్పన చేసి, రిజర్వేషన్లపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, వాటిని డిస్పోజ్ చేసినానంతరం రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత సర్కారు ఆదేశిస్తే జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డులకు ఎన్నికలను నిర్వహించే అవకాశాలున్నాయి.

**సెన్సస్ లెక్కలు తేలిన తర్వాత మరోసారి డీలిమిటేషన్**

ప్రస్తుతం జీహెచ్ఎంసీ వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను 2011 జనాభా లెక్కలు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వద్దనున్న తాజాగా వర్తమాన జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని 45 వేలకు ఓ వార్డు అనే ప్యారమీటర్ తో పదిశాతం తక్కువ, ఎక్కువగా వార్డులను డీలిమిటేషన్ చేసింది. వచ్చే సంవత్సరం దేశ వ్యాప్తంగా తాజాగా జనాభా లెక్కలను తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సన్సెస్ ప్రక్రియను నిర్వహించనుంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత 2027 తర్వాత ఇవే 300 వార్డులను అప్పటి జనాభా ప్రకారం డీలిమిటేషన్ చేయనున్నట్లు అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం పట్టణ స్థానిక సంస్థల విలీనం, వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను హడావుడిగా చేస్తున్న సర్కారు అంతలోపే జీహెచ్ఎంసీకి ఎన్నికలు నిర్వహిస్తే, పాలక మండలిని అలాగే కొనసాగిస్తూ తాజాగా సేకరించిన జనాభా లెక్కల ప్రకారం వార్డులను మరోసారి డీలిమిటేషన్, రిజర్వేషన్లను చేపట్టి, తదుపరిగా నిర్వహించనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలకు అమలు చేస్తారన్న చర్చ సైతం లేకపోలేదు. అంటే సన్సెస్ ప్రక్రియ ముగిసే వరకు జీహెచ్ఎంసీ ఒకే కార్పొరేషన్ గా కొనసాగే అవకాశాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఆ తర్వాత కూడా జీహెచ్ఎంసీ ఒకే కార్పొరేషన్ గా కొనసాగిస్తారా? లేక ఎన్ని ముక్కలుగా చేస్తారో కూడా క్లారిటీ రావల్సి ఉంది.




# దమ్ముంటే వారితో రాజీనామా చేయించు

మొదటిపేజీ తరువాయి



శైలిలో కడిగిపారేశారు.

**ఆ 66 శాతం నిజమైతే.. తేల్చుకుందాం రా!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని కేటీఆర్ విమర్శించారు. "నిన్న హైదరాబాద్ ప్రెస్ మీట్ లో రేవంత్ రెడ్డి మొదట కాంగ్రెస్ 66 శాతం గెలిచిందని, ఇది ప్రభుత్వం పై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారు. కానీ, సరిగ్గా ఐదు నిమిషాలకే మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారు. ముఖ్యమంత్రి గారూ.. మీకు నిజంగానే 66 శాతం ప్రజాధరణ ఉంటే, నా సవాల్ స్వీకరించండి. మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి. అప్పుడు ప్రజలే చెప్తారు ఎవరి శాతం ఎంతో.. ఎవరి బతుకెంతో.. ఎవరి సత్తా ఎంతో ప్రజా క్షేత్రంలోనే తేలిపోతుంది" అని కేటీఆర్ గర్జించారు.

**గడ్డిపోచ లాంటి పదవుల కోసం ఇంత దిగజారుతారా?**

ఫిరాయింపు ఎమ్మెల్యేల తీరుపై కేటీఆర్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంత్రులుగా, స్పీకర్లుగా పనిచేసిన కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కేవలం 'గడ్డిపోచ' లాంటి పదవుల కోసం ఇంతలా దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. "బయట కాంగ్రెస్‌లో చేరామని మైకుల్లో ప్రగల్భాలు పలికి, రాహుల్ గాంధీ కండువా కప్పారని చెప్పుకున్న ఈ పెద్ద మనుషులు.. ఇప్పుడు స్పీకర్ విచారణలో మాత్రం తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. పదవుల కోసం సూరు పట్టుకొని గబ్బిలాల్లా వేలాడుతున్న వీరి బతుకులు పూర్తిగా ఆగమైపోయాయి" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఒత్తిడితో స్పీకర్ కూడా ఆధారాలను పక్కన పెట్టి అబద్ధాలు చెప్పాల్సిన దుస్థితికి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బయట కాంగ్రెస్‌లో చేరామని చెప్పి, స్పీకర్ ముంగట పోయి తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెప్తున్నారన్నారు. అటలో అంపైర్ గా ఉండాల్సిన స్పీకర్ కూడా తాము ఇచ్చిన ఆధారాలు పక్కన పెట్టి ముఖ్యమంత్రి చెప్పినట్టు అబద్ధాలు ఆడక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లారని, ఇక ఆ 10 మంది ఎమ్మెల్యేల బతుకు పూర్తిగా ఆగమైపోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్పారు**

రైతులను, మహిళలను, బీసీలను మోసం చేసినందుకే ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికార యంత్రాంగాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారని స్పష్టం చేశారు. "సిరిసిల్లలో 117 పంచాయతీలకు గాను 80 చోట్ల బీఆర్ఎస్ గెలవడమే దీనికి నిదర్శనం. ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాలు తిరిగినా, బెదిరించినా ప్రజలు మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు. పల్లెలు బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కేసీఆర్ నాయకత్వమే శరణ్యమని ప్రజలు మరోసారి తేల్చి చెప్పారు" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

**కార్యకర్తలకు భరోసా..**

బెదిరింపులకు, ఫోన్ కాల్స్‌కు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "గెలిచిన వారు, ఓడిపోయిన వారు కలిసి పనిచేయాలి. వచ్చే సంవత్సరంలో కొత్తగా సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసుకుంటాం. పాత తరం అనుభవం, కొత్త రక్తం కలిసేలా చాకుల్లాంటి పిల్లలతో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేస్తాం" అని ప్రకటించారు. రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా ఇదే ప్రభంజనం కొనసాగిస్తామని ఆయన పిలుపునిచ్చారు.

# పీఏసీఎస్, డీసీసీబీల పాలకవర్గాలు రద్దు

మొదటిపేజీ తరువాయి



9 డీసీసీబీల పాలకమండళ్లను రద్దు చేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రద్దుతో సంఘాల రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోకుండా ఉండేందుకు పర్సన్ ఇన్‌ఛార్జి లను నియమించాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఈ ఇన్‌ఛార్జిలు సంఘాల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తారు.

తెలంగాణలోని పీఏసీఎస్ సంఘాలు రైతులకు చిన్న కాలపు రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సంఘాలు డీసీసీబీలకు అనుబంధంగా పనిచేస్తాయి. ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలం ముగిసినందున సహకార చట్టం నిబంధనల ప్రకారం వీటిని రద్దు చేయడం తప్పనిసరి అయింది. గతంలో కూడా ఇలాంటి సందర్భాల్లో పాలకవర్గాల టర్మ్‌ను ఎక్స్‌టెండ్ చేసిన ఉదాహరణలు ఉన్నాయి (ఉదా: 2025 ఫిబ్రవరిలో 6 నెలలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు). అయితే ఇప్పుడు రద్దు చేసి పర్సన్ ఇన్‌ఛార్జి విధానాన్ని అమలు చేయడం ద్వారా సంఘాలు సజావుగా నడిచేలా చూస్తున్నారు. పర్సన్ ఇన్‌ఛార్జి సాధారణంగా సంబంధిత జిల్లా సహకార అధికారులు లేదా ప్రభుత్వం నియమించే అధికారులు ఉంటారు. వీరు సంఘాల ఆర్థిక లావాదేవీలు, రుణ వితరణ, సభ్యుల సేవలు అందించడంలో పూర్తి బాధ్యత వహిస్తారు.

త్వరలో రాష్ట్రంలో కొత్త మండలాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా పీఏసీఎస్ సంఘాలను రీఆర్గనైజ్ చేయనున్నట్టు సమాచారం. ఇటీవలే (2025 జనవరి నాటికి) రాష్ట్రంలో 500కు పైగా కొత్త పీఏసీఎస్ సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం నూతన సహకార విధానం ప్రకారం ప్రతి గ్రామంలో ఒక పీఏసీఎస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాల నుంచి ప్రతిపాదనలు కోరగా, కొన్ని జిల్లాల్లో (ఉదా: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 40 కొత్త సంఘాలు) కొత్తవి ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగుతోంది.

ఇది రైతులకు మరింత సమీపంలో సేవలు అందేలా చేస్తుందని, సహకార రంగాన్ని బలోపేతం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. అదనంగా, రాష్ట్రం స్వతంత్రంగా 830 పీఏసీఎస్‌లను కంప్యూటరైజేషన్ ప్రాజెక్ట్ కిందకు తీసుకొచ్చింది, ఇది పారదర్శకతను పెంచుతుంది. ఈ మార్పులతో రైతులకు రుణాలు, ఇన్‌పుట్స్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే కొత్త ఎన్నికలు లేదా పునర్వ్యవస్థీకరణ పూర్తి అయ్యే వరకు పర్సన్ ఇన్‌ఛార్జి విధానం కొనసాగుతుంది. రైతులు తమ సంఘాల్లో సాధారణంగా సేవలు పొందవచ్చు. తెలంగాణ సహకార రంగం రైతాంగానికి వెన్నెముకగా నిలుస్తూ, ఈ మార్పులతో మరింత బలపడే అవకాశం ఉంది.

# హరీశ్‌రావు ఔదార్యం

మొదటిపేజీ తరువాయి

ఇంటి పత్రాలను బ్యాంకులో తనఖా పెట్టి, మమతకు రూ.20 లక్షల విద్యారుణం మంజూరు చేయించారు. అంతేకాకుండా, హాస్టల్ ఫీజు మరియు ఇతర ఖర్చుల కోసం తన సొంత నిధుల నుంచి రూ.1 లక్ష నగదు కూడా అందజేశారు. ఈ సాయంతో మమత చదువు అడ్డంకులు తొలగిపోయాయి. మమత, రామచంద్రం హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. "హరీశ్‌రావు గారు మా కుటుంబానికి దేవుడిలా వచ్చారు. ఇలాంటి సాయం ఎప్పుడూ ఊహించలేదు" అని భావోద్వేగంతో అన్నారు.

ఇది హరీశ్‌రావు మొదటిసారి కాదు. మూడేళ్ల క్రితం సిద్దిపేట్ ఆటో డ్రైవర్ల కోఆపరేటివ్ సొసైటీకి రుణాలు రాబట్టేందుకు కూడా తన ఇంటినే తనఖా పెట్టారు. పేద విద్యార్థుల చదువులకు ఎప్పుడూ ముందుండే హరీశ్‌రావు ఈ చర్యతో మరోసారి ప్రజల హృదయాల్లో చేరువయ్యారు. ఈ సంఘటన రాజకీయ వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా చర్చనీయాంశమైంది. "ఇలాంటి నాయకులు ఇంకా ఉన్నారని నిరూపించారు హరీశ్‌రావు" అని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మమత ఇప్పుడు నిర్భయంగా తన పీజీ వైద్యవిద్యను కొనసాగించనుంది. హరీశ్‌రావు ఉదారతకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే!

**హరీషన్నది తీర్చుకోలేని రుణం**

" నా బిడ్డ కష్టపడి చదివి ప్రభుత్వ కన్వీనర్ కోటాలో సీటు సంపాదించినప్పటికీ ఆర్థిక స్తోమత లేక ట్యూషన్ ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదు. మేం చేసిన ప్రయత్నాలకు అన్ని దారులు మూసుకుపోయాయి. కానీ ఆపద వచ్చినవారి కోసం నిరంతరం తన ఇంటి తలుపులు తెరిచి ఉంచే హరీష్ అన్న ఏకంగా తన ఇంటిని మాకోసం తాకట్టు పెడతాడని కలలో కూడా ఊహించలేదు. నా నలుగురు బిడ్డలు హరీష్ అన్న స్ఫూర్తితోనే, ఆయన చేసిన సహాయంతోనే ఎంబిబిఎస్ వైద్య విద్య చదువుతున్నారు. పెద్ద బిడ్డ ప్రస్తుతం పీజీ సీటు దక్కించుకోగా.. రెండో అమ్మాయి ఎంబిబిఎస్ హౌస్ సర్జన్ చేస్తున్నది. మరో ఇద్దరు అమ్మాయిలు జగిత్యాలలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదువుతున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని 3 లక్షల మందిలో మేము ఒకరం. అంతేతప్ప మరెలాంటి సంబంధం లేదు. అయినా మా పాప భవిష్యత్తు కోసం ఒక్క క్షణం ఆలోచించకుండా తన ఇంటిని తాకట్టు పెట్టిన హరీష్ అన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము.



# ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి



ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవ కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి ప్రారంభమైన రెండేళ్లలో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులను విజయవంతంగా పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజల నుంచి వస్తున్న అనేక సమస్యలకు సకాలంలో పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ ప్రజావాణి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని చెప్పారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వంతో మాట్లాడే వేదికగా ప్రజావాణి మారిందని పేర్కొన్నారు.

ప్రజావాణికి స్పందన లేదంటూ విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని భట్టి విక్రమార్క ఆక్షేపించారు. ఎంతటి విమర్శలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. అధికారానికి దూరమైన విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల కోసం పనిచేస్తూనే ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణలోని వనరులు ప్రజలకు ఉపయోగపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు ప్రజావాణి ద్వారా తమ సమస్యలు ఎలా పరిష్కారమయ్యాయో వివరిస్తూ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అంకితభావంతో సేవలందిస్తూ ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యాదేవరాజన్‌లను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నియామకాల్లో నిజాయితీ అవసరం

మొదటిపేజీ తరువాయి

కమిషన్లు నియామకాల్లో పారదర్శకత, నిష్పక్షపాతానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎదుర్కొంటున్న సవాళ్లకు త్వరిత పరిష్కారాలు అవలంబించాలని సూచించారు.

శాశ్వత ఎగ్జిక్యూటివ్‌గా పిలుచుకునే సివిల్ సర్వెంట్ల ఎంపికలో పీఎస్సీలు కీలక పాత్ర పోషిస్తాయని, వారి నిజాయతీ, సున్నితత్వం, సామర్థ్యం దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని రాష్ట్రపతి అన్నారు. సాంకేతికతలో ఉద్భవిస్తున్న సవాళ్లను ముందుగానే గుర్తించి, పారదర్శకతను బలోపేతం చేయాలని, ప్రపంచ స్థాయి సివిల్ సర్వెంట్ల బృందాన్ని తయారు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే, మహిళల అవసరాలు, ఆకాంక్షల పట్ల సివిల్ సర్వెంట్లు మరింత సున్నితంగా వ్యవహరించాలని, అభ్యర్థుల్లో జెండర్ సెన్సిటైజేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నైపుణ్యాల లోపాన్ని శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని, కానీ నిజాయతీ లోపాన్ని కాదని




ఆమె స్పష్టం చేశారు. ఈ సదస్సులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చలు జరగనున్నాయి.

# 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- భారీగా ఆయుధాల అప్పగింత
- సీఎం రేవంత్ పిలుపు మేరకు నిర్ణయం
- అజ్ఞాతంలో ఉన్నవారు కూడా జన జీవనంలోకి రండి
- ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాలను ఉపయోగించుకోండి
- మావోయిస్టులకు డీజీపీ శివధర్ రెడ్డి సూచన

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

మావోయిస్టుల లొంగు'బాట' కొనసాగుతున్నది. శుక్రవారం 41 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. భారీ సంఖ్యలో ఆయుధాలను అప్పగించారు. జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకే మావోయిస్టులు లొంగిపోతున్నట్టు డీజీపీ చెప్పారు. హైదరాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులు మొత్తం 24 ఆయుధాలను అప్పగించారన్నారు. వీటిలో మూడు ఏకే 47 తుపాకులతోపాటు ఓ లైట్ మిషన్ గన్, ఐదు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, ఏడు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక బీజీఎల్ గన్, నాలుగు 303 రైఫిళ్లు, ఒక సింగిల్ షాట్ రైఫిల్, రెండు ఎయిర్ గన్లు ఉన్నట్టు తెలిపారు. మొత్తం 733 తూటాలు, 8 బీజీ షెల్స్‌ను కూడా అప్పగించినట్టు చెప్పారు.

**మావోయిస్టుల్లో విభేదాలు**

24 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఎర్రోళ్ల రవి అలియాస్ సంతోష్‌తోపాటు 11 మంది గెరిల్లా ఆర్మీ బెటాలియన్ సభ్యులు లొంగిపోయిన వారిలో ఉన్నట్టు డీజీపీ చెప్పారు. అర్బన్ నక్సలైట్‌గా పని చేస్తూ మావోయిస్టులకు షెల్టర్ ఇస్తున్న మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామ వాస్తవ్యుడు, పీడీఎస్ సభ్యుడు కవికారపు ప్రభంజన్ కూడా సరెండర్ అయినట్టు తెలిపారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రాణాలు కాపాడుకోవడానికి ఏమాత్రం పరిచయం లేని ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్ట్ పార్టీ అగ్ర నాయకత్వం క్యాడర్‌పై ఒత్తిడి తెస్తున్నదని శివధర్ రెడ్డి చెప్పారు. కొత్త ప్రాంతాల భౌగోళిక పరిస్థితులపై సరైన అవగాహన లేకపోవడం, స్థానిక ప్రజల మద్దతు కూడా అందకపోవడంతో ఆయా చోట్ల ఉండడంలో మావోయిస్టులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. రోజువారీ నిత్యావసర వస్తువులు కూడా అందుబాటులో లేని పరిస్థితుల్లో తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారన్నారు. దీనికి తోడు మావోయిస్ట్ పార్టీలో పెరిగిపోయిన అంతర్గత విభేదాలు, వర్గ పోరు, నాయకత్వ స్థాయిలో తలెత్తుతున్న అభిప్రాయ భేదాలు, క్షీణిస్తున్న ఆరోగ్యం మావోయిస్టుల లొంగుబాటుకు దారి తీస్తున్నాయన్నారు. దాంతోపాటు లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసం కూడా వాళ్లు ఈ నిర్ణయం తీసుకోవడానికి ఓ ప్రధాన కారణమన్నారు.

**తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేలు**

లొంగిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు



పునరావాసం కోసం రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయల చొప్పున ఇవ్వనున్నట్టు డీజీపీ చెప్పారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా లైట్ మిషన్ గన్‌ను అప్పగించినందుకు రూ.5 లక్షలు, ఏకే 47 రైఫిళ్లను అప్పగించినందుకు 4 లక్షల రూపాయల, ఇన్సాస్ రైఫిల్‌కు రూ.2 లక్షలు, 303 రైఫిళ్లకు రూ.లక్ష, యూజీబీఎల్ అటాచ్ మెంట్‌కు రూ.40 వేలు, ట్వెల్వ్ బోర్ సింగిల్ షాట్ గన్‌కు 30 వేల రూపాయల చొప్పున నగదు ఇవ్వనున్నట్టు తెలిపారు. తాజాగా లొంగిపోయిన మావోయిస్టులందరికీ కలిపి కోటి 46 లక్షల 30 వేల రూపాయలను ఇస్తామన్నారు. తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేల రూపాయలు ఇచ్చినట్టు తెలిపారు.

**ఈ ఏడాదిలో 509 మంది లొంగుబాటు**

ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 509 మంది మావోయిస్టులు లొంగిపోయినట్టుగా డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 17 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 57 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్టుగా వివరించారు. మావోయిస్ట్ పార్టీ క్రమంగా బలహీన పడుతున్నదనే విషయాన్ని ఈ లొంగుబాట్లు స్పష్టం చేస్తున్నాయన్నారు. తెలంగాణకు చెందిన 54 మంది ప్రస్తుతం పార్టీలో ఉన్నట్టు చెప్పారు.

**2026, మార్చి 31 లోపు..**

వచ్చే సంవత్సరం మార్చి 31వ తేదీ లోపు మావోయిస్ట్ పార్టీని పూర్తిగా అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తున్నదని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. అయితే, డెడ్ లైన్ తరువాత పోలీసుల దాడులు తగ్గుముఖం పడతాయని మావోయిస్ట్ పార్టీ నాయకత్వం కేడర్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అలాంటిదేమీ జరగదని, మావోయిస్ట్ పార్టీ ఉనికిని పూర్తిగా రూపుమాపే వరకు ఆపరేషన్ కగార్ కొనసాగుతుందన్నారు. పోరు వద్దు ఊరు ముద్దు పిలుపును పునరుద్ఘాటించిన డీజీపీ, ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిసిపోయి ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాలను ఉపయోగించుకుని సాధారణ జీవితం గడపాలని సూచించారు.



## ఏకగ్రీవమైతే అది కాంగ్రెస్ గెలుపా?

- గతంలో 163 సర్పంచ్ స్థానాలు.. ఇప్పుడు వెయ్యికి పైగా గెలుపు
- 1200 మందికి పైగా ఉప సర్పంచ్ స్థానాలు గెలిచాం
- 10 వేలకు పైగా వార్డుల్లో విజయం సాధించాం
- కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెబుతారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1000 నుంచి 1200 మంది సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, వారిని కూడా కాంగ్రెస్ గెలుపుగా ఆ నేతలు ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. గెలిచిన వారందరినీ తమ వారిగా చెప్పుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. నిర్మల్ జిల్లా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులన ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 181 గ్రామపంచాయతీలుంటే, అందులో 103 గ్రామపంచాయతీల్లో బజేకేపీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిచారన్నారు. అదేవిధంగా నిర్మల్ జిల్లాలో 128 గ్రామపంచాయతీలు ఉంటే, దాదాపు 80కి పైగా స్థానాల్లో గెలిచిందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా 32 మంది బీజేపీ సర్పంచులు గెలిచినట్లు రాంచందర్ రావు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఏమాత్రం న్యాయం జరగలేదన్నారు. ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఫైరయ్యారు. అందుకే రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ కు తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో గతంలో బీజేపీకి కేవలం 163 మంది మాత్రమే సర్పంచులు ఉండగా, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో వెయ్యికి పైగా స్థానాల్లో గెలిచారన్నారు. 1200 మందికి పైగా ఉపసర్పంచులు, 10 వేల మందికి పైగా వార్డు సభ్యులు విజయం సాధించారన్నారు. గతంలో ఫైనాన్స్ కమిషన్ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని రాంచందర్ రావు ప్రజలను కోరారు. తెలంగాణ నిజంగా బంగారు తెలంగాణ కావాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు.

## మహాత్మ గాంధీ ఉపాధి హామీ చట్టం రద్దు చేయొద్దు

**బూర్గంపహాడ్,డిసెంబర్ 19(సిద్దిపేట పవర్):**



బూర్గంపహాడ్ మండలం పాండవుల బస్తీలో ఉపాధి కార్మికులతో జిరామ్‌జీ పత్రాన్ని తగలబెట్టడం జరిగింది.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మార్చాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఈరోజు పత్రాలని తగలబెట్టడం జరిగింది.ఇది దేశంలోనే ఉపాధి కార్మికులకి హక్కు ఈ హక్కుని తొలగించటానికి గాని పేరు మార్చడానికి గాని కేంద్ర ప్రభుత్వానికి మంద బలం ఉందని ఉపాధి హామీ చట్టాన్ని జి రామోజీ జి పేరుతో మార్చటం సరేంది కాదని కార్మికులకు ప్రమాదంగా ఉపాధి మారుతుందని ఇప్పటికే 27 లక్షల ఉపాధి కార్డులను దేశంలో తొలగించడం జరిగింది, అని కేంద్ర ప్రభుత్వం 60% నిధులు ఇస్తామని 40% రాష్ట్రాలు భరించాలని చెప్పటం చాలా దారుణం ఉంది కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేయడం జరిగింది, జరుగుతుంది రాష్ట్రాల పైన భారాల మోపితే రాష్ట్రంలో ఈవలేనప్పుడు కేంద్రం నుండి ఇవ్వలేమని చెప్పటానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్ని తిప్పి కొట్టాలని ఉపాధి కార్మికులందరూ ఏకం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు దేశంలోనే వలసలు గ్రామాల నుండి పోకుండా తన గ్రామంలోనే పని చేసుకొని బతకటం నికి తెచ్చిన ఉపాధి ఆమి పని కార్మికులకు లేకుండా చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశం కోసం పోరాటం చేసిన బ్రిటిష్ వాళ్ల పైన అనేక పోరాటాలు చేసిన మహాత్మా గాంధీ పేరుని ఉపాధి నుండి తొలగించటం సరైనది కాదని అన్నారు గాంధీని చంపిన గాడ్సే వారు దేశభక్తులని చెపుతున్న ఆర్ఎస్ఎస్ బిజెపి కానీ దేశం కోసం పోరాటం చేసిన మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఉపాధిని తొలగించటం సరైనది కాదని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బోయిన ఆదెమ్మ బర్ల మాణిక్యం గుమ్మడి గోవిందమ్మ పుట్టి నాంచారమ్మ పుట్టి చిట్టెమ్మ పుట్టి నాని పుట్టి లక్ష్మి బర్ల లక్ష్మణ్ తదిత

## విపక్ష ఎంపీలతో మోడీ 'చాయ్ పే చర్చ'

మొదటిపేజీ తరువాయి

(చాయ్ పే చర్చా) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు సహా పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. రాజకీయ భేదాలను పక్కనబెట్టి, ప్రశాంత వాతావరణంలో ఈ సమావేశం సాగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ప్రియాంకా గాంధీ మధ్య స్నేహపూర్వక సంభాషణ జరిగినట్లు సమాచారం. ప్రియాంకా ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ నియోజకవర్గం అంశం ఈ చర్చలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. వయనాడ్ అడవుల్లో లభించే ఓ ప్రత్యేకమైన మూలికను తాను ఉపయోగిస్తున్నానని ప్రియాంకా ఈ సందర్భంగా తెలిపారు. ఆ మూలిక వాడకంతో తనకు గతంలో ఉన్న అలర్జీ సమస్యలు పూర్తిగా నయమయ్యాయని ఆమె చెప్పినట్లు సమాచారం. ఇదే సందర్భంలో గురువారం అర్ధరాత్రి పార్లమెంట్‌లో ఆమోదం పొందిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' — వీబీజీ రామ్ జీ బిల్లుపై కూడా అఖిలపక్ష ఎంపీలు ప్రధానితో చర్చించారు. ఏడాదికి 125 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా ఉన్న ఈ బిల్లును అర్ధరాత్రి వేళ ఆమోదించడం సరైన పద్ధతి కాదని కొందరు ఎంపీలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శీతాకాల సమావేశాలను మరికొన్ని రోజులు పొడిగించి ఉండాల్సిందని వారు ప్రధానికి సూచించినట్లు సమాచారం.

దీనికి స్పందించిన ప్రధాని మోదీ, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తరచూ నిరసనలు చేపట్టడం వల్లే పార్లమెంట్ సమావేశాలు పదేపదే అంతరాయాలకు గురయ్యాయని వ్యాఖ్యానించారు. అయితే తన వ్యాఖ్యలను హాస్యంగా మలుస్తూ, "అరిచీ అరిచీ మీ గొంతులు అలసిపోవద్దని నేనూ కోరుకుంటున్నాను" అని సరదాగా అనడంతో అక్కడున్న నేతలందరూ చిరునవ్వులు చిందించినట్లు తెలిసింది. ఈ చర్చ మొత్తం ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో సాగిందని వర్గాలు వెల్లడించాయి.



## హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

- ఐమాక్స్ లో లాంచనంగా ప్రారంభించిన ప్రభుత్వం
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- డిసెంబర్ 21 వరకు కార్యక్రమం నిర్వహణ
- యువ ప్రతిభకు పురస్కారాలు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్రంలో సినిమా, టెలివిజన్ రంగాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణం జరిగేలా తెలంగాణ ఎంతో అనుకూల వాతావరణం కల్పించిందని, హైదరాబాద్ ఇప్పుడు దేశవ్యాప్తంగా సినిమా నిర్మాణాలకు ప్రముఖ హబ్‌గా మారిందని ఆయన పేర్కొన్నారు.

ఈ మేరకు డిసెంబర్ 19, 2025న హైదరాబాద్‌లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్ (ఐమ్యాక్స్)లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TFDC) ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అధ్యక్షత వహించారు.

ఈ ఫెస్టివల్‌ను దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ ప్రధానంగా నిర్వహిస్తోంది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TFDC), సాంస్కృతిక శాఖ, యువజన మరియు పర్యాటక శాఖల సహకారంతో జరుగుతోంది. ప్రముఖ దర్శకుడు మరియు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ సభ్యుడు ఉమా మహేశ్వర రావు ఆర్గనైజింగ్ కమిటీ పేట్రన్‌గా వ్యవహరిస్తున్నారు.

**ఫెస్టివల్ వివరాలు:**

తేదీలు: డిసెంబర్ 19 నుంచి 21 వరకు (మూడు రోజులు).

వేదిక: ప్రసాద్స్ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 మరియు 5.

ఎంట్రీలు: ప్రపంచవ్యాప్తంగా సుమారు 704 నుంచి 705 లఘు చిత్రాలు (షార్ట్ ఫిల్మ్స్) దరఖాస్తు చేసుకున్నాయి - ఇది భారత్‌లో ఒక షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు రికార్డు స్థాయి స్పందన.

సెలెక్టెడ్ ఫిల్మ్స్: వీటిలో నుంచి 60 అధికారిక ఎంట్రీలు, 11 నార్త్ ఈస్ట్ పెవిలియన్ ఫిల్మ్స్, 5 క్లాసిక్ ఫిల్మ్స్‌ను ప్రదర్శనకు ఎంపిక చేశారు.

*జ్యూరీ*: ప్రముఖ సినీ విశ్లేషకులు, దర్శకులు ఉన్నారు - నాగేశ్ కుకునూర్, మైథిలి రావు, లీమా దాస్, ఉత్పల్ బోర్పుజారి వంటి వారు.

డిసెంబర్ 21న వాలెడిక్టరీ మరియు అవార్డ్స్ సెరెమనీ జరుగుతుంది.

మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, "లఘు చిత్రాలు యువ దర్శకులకు సృజనాత్మక స్వేచ్ఛను ఇస్తాయి. కొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేసి తమ కథలను తమ శైలిలో చెప్పే అవకాశం కల్పిస్తాయి. చాలా మంది ప్రముఖ దర్శకులు షార్ట్ ఫిల్మ్స్ నుంచి ఎదిగారు. ఈ ఫెస్టివల్ హైదరాబాద్, తెలంగాణకు మైలురాయి. యువ ప్రతిభను వెలికితీసి, కొత్త ఆలోచనలకు అంకురార్పణ చేయడంలో లఘు చిత్రాలు ఎంతో దోహదపడతాయి" అని అన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, "సినిమాల్లో ప్రజల సంస్కృతి, జీవన విధానం, సామాజిక సమస్యలు ప్రతిబింబించాలి. ఔత్సాహిక దర్శకులు, నిర్మాతలు ఈ దిశగా దృష్టి పెట్టాలి" అని సూచించారు. దిల్ రాజు మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్ యువతకు ప్లాట్‌ఫాం కల్పించడంతో పాటు, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ హబ్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ ఫెస్టివల్ తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యల్లో ఒకటి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సినిమా రంగానికి పూర్తి మద్దతు ఇస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలతో యువ ప్రతిభకు అవకాశాలు పెరిగి, తెలంగాణ సినీ పరిశ్రమ మరింత వైభవంగా ఎదుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఈవెంట్‌లో పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులు, దర్శకులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ గుర్తింపు పొందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది!




## నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు.

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార,చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- పాకబండ యందు 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ఖమ్మం,డిసెంబర్ 19(సిద్దిపేట పవర్):**

ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం పట్టిష్ట చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శుక్రవారం ఖమ్మం పట్టణం పాకబండ దగ్గర నూతనంగా నిర్మించనున్న 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.అంతరాయం లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం 2.5 కోట్ల నిధులతో ఖమ్మం పట్టణంలో పాకబండ వద్ద నూతనంగా 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టిందని, దీని ద్వారా చెరువు బజార్, హౌసింగ్ బోర్డ్, అల్లిపురం క్రాస్ రోడ్ ఐటి హబ్ ఏరియా, రామచంద్రయ్య నగర్, అబ్దుల్ కలాం నగర్, పార్శి బంధం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా మెరుగు అవుతుందని అన్నారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి



చేసుకోవాలని, ప్రజాప్రతినిధులు స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. మనం చేసే పనులు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడాలని, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఖమ్మం అభివృద్ధికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, ప్రతి ఒక్క రూపాయి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్.ఇ. శ్రీనివాస చారి, ఖమ్మం అర్బన్ మండల తహసిల్దార్ సైదులు,కార్పొరేటర్లు, ఇంకా పలు శాఖల అధికారులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# నాయకులు నిజాయితీగా ఉంటే ఓటర్లు నిజాయితీగా ఉంటారు

**చేర్యాల, డిసెంబర్ 19 (సిద్ధిపేట పవర్)**

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చేర్యాల మండలం అయినాపూర్ గ్రామానికి సంబంధించి నాలుగో వార్డ్ లో విజయం సాధించిన ప్రముఖ తెలంగాణ కళాకారులు పిన్నింటి రత్నం సతీమణి పిన్నింటి రేఖ..ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ కేవలం నామినేషన్ 250 రూపాయలతోనూ గెలిచానని మందుకు డబ్బుకు ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛమైన ఓటును స్వేచ్ఛగా వేశారని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు..సేవా చేయాలి అని సంకల్పంతో ముందుకు నాయకులకు ఓటర్లు కూడా మద్దతు ఇస్తారు అని తెలిపారు..రేఖ కు వార్డు సభ్యులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు



# భారీగా నకిలీ ఈఎస్ఎస్ఈ ఉత్పత్తుల నివారణకు రంగంలోకి ఎన్ ఫోర్స్మెంట్

- **నకిలీ ఈఎస్ఎస్ఈ సిగరేట్ల పట్టివేత**

**సికింద్రాబాద్, డిసెంబర్ 19 ( సిద్ధిపేట పవర్ ):**



నకిలీ ESSE సిగరెట్ల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు ప్రముఖ పొగాకు సంస్థ KT&G ఢిల్లీ NCR ప్రాంతంలో భారీ ఎత్తున ఎన్ ఫోర్స్ మెంట్ శాఖ చర్యలు చేపట్టింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు, తన లీగల్ భాగస్వామి ఎస్.ఎస్. రాణా & కో. మరియు ఎన్ఫోర్స్ మెంట్ అధికారులతో కలిసి ఒకే రోజులో 14 మంది హోల్ సేలర్లపై సమన్వయంతో కూడిన దాడులు నిర్వహించింది.ఈ రైడ్స్ లో ESSE ట్రేడ్మార్క్ పేరుతో విక్రయించబడుతున్న భారీ మొత్తంలో నకిలీ సిగరెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడుల సమయంలో పరిశీలించిన పత్రాలు, రికార్డుల్లో సరైన లెక్కలు లేకపోవడం వెలుగులోకి రావడంతో, నకిలీ వ్యాపారం పూర్తిగా అసంఘటితంగా కొనసాగుతున్నట్లు స్పష్టమైంది. ఈ చర్యలతో అక్రమ సరఫరా గొలుసుకు తీవ్ర దెబ్బ తగిలిందని KT&G వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 14 మంది నిందితులపై ఢిల్లీ హైకోర్టులో కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. భారతదేశంలోని పలు నగరాల్లో నకిలీ మరియు అక్రమ పొగాకు ఉత్పత్తుల వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో, దేశవ్యాప్తంగా ఇలాంటి దాడులు కొనసాగిస్తామని KT&G ప్రకటించింది. ఈ క్రమంలో ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో త్వరలోనే మరిన్ని ఎన్ఫోర్స్ మెంట్ చర్యలు చేపట్టనుంది. ఈ సందర్భంగా KT&G హెడ్ క్వార్టర్స్ IP డివిజన్ డైరెక్టర్ యంగ్హూన్ కిమ్ మాట్లాడుతూ, వినియోగదారుల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే నకిలీ ఉత్పత్తులపై ఎలాంటి రాజీ ఉండదని, ESSE ట్రేడ్మార్క్ ను దుర్వినియోగం చేసే వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు కఠినంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అలాగే, వినియోగదారులు ESSE సిగరెట్లను కేవలం అధికారిక డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని KT&G సూచించింది.

# బోయిగూడ లో అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎమ్సీ కి ఫిర్యాదు

- **చర్యలు తీసుకోవడంలేదని బస్తీ వాసుల ఆవేదన**

**సికింద్రాబాద్, డిసెంబర్ 19 ( సిద్ధిపేట పవర్ ):**



బేగంపేట సర్కిల్-30 పరిధిలోని న్యూ బోయిగూడ ప్రాంతంలోని ఉప్పులమ్మ టెంపుల్ పక్కనున్న 20 ఫీట్ల ప్రభుత్వ రోడ్డుపై అక్రమ నిర్మాణం జరుగుతోందని స్థానికులు జీహెచ్ఎమ్సీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు తమ 6-5-144 నెంబర్ గల ఇంటి ముందు ఉన్న ప్రధాన ప్రవేశద్వారాన్ని మించి అదనపు బ్యాక్డోర్ నిర్మాణం చేపట్టి దాదాపు 5 ఫీట్ల రోడ్డును ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ నిర్మాణం వల్ల ప్రజా రహదారి దిగ్బంధం అవుతూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, జీహెచ్ఎమ్సీ బిల్డింగ్ రూల్స్ ను ఉల్లంఘించి అనుమతులు లేకుండానే పనులు కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయ నాయకుల మద్దతుతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే నవంబర్ 24న ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు. తక్షణమే స్పాట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు జీహెచ్ఎమ్సీ అధికారులను కోరుతున్నారు.

# గ్రామ సంక్షేమం కోసమే పని చేయండి

- **నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు సూచన**
- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**చేర్యాల, డిసెంబర్ 19 (సిద్ధిపేట పవర్)**



గ్రామ అభివృద్ధి యే ప్రధాన లక్ష్యంగా పని చేయాలి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు..చేర్యాల పట్టణం రేణుక గార్డెన్ లో నూతనంగా ఎన్నికైన బి.ఆర్.ఎస్. పార్టీ బలపరిచిన గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ అభినందన సభ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలవటం కోసం ఎంత కష్టపడ్డారో, దానిని సక్రమంగా వినియోగించుకోవడానికి కూడా అంతే కష్టపడాలి అని తెలిపారు, అదే విధంగా గ్రామాల అభివృద్ధి, గ్రామ ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పని చేయాలి పల్లా దిశానిర్దేశం చేశారు..అనంతరం ఎన్నికైన సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు.. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాల్లోని గ్రామాల సర్పంచ్ లు, వార్డు సభ్యులు, బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కోదాడ కర్ల రాజేష్ కస్టోడియల్ మృతి కేసు

- **జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కేసు నమోదు**

**సికింద్రాబాద్, డిసెంబర్ 19 ( సిద్ధిపేట పవర్ ) :**

కోదాడకు చెందిన కర్ల రాజేష్ కస్టోడియల్ మరణంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్హెచ్ఆర్సీ) కేసు నమోదు చేసింది. మృతుడి తల్లి లలితమ్మ ఫిర్యాదుపై పోలీసులు స్పందించలేదని ఆరోపిస్తూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామా రావు ఇమ్మానేని కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కమిషన్, దీనికి కేసు నెం. 289/17/IN/2025గా నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఘటనలో కోదాడ సీఐ ప్రతాపలింగం, చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డి, కానిస్టేబుల్ రామారావు, హోమ్ గార్డ్ నర్సింహారావులపై చర్యలు తీసుకునేలా తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి సీవీ ఆనంద్‌కు ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది రామారావు ఇమ్మానేని కోరారు. అలాగే, కర్ల రాజేష్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం మంజూరు చేసేలా కమిషన్ ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ కేసుపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్హెచ్ఆర్సీ ని కోరినట్లు తెలిపారు.



# అమావాస్య అన్నదాన వితరణ కార్యక్రమం

- **ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో**

**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక కూరగాయల మార్కెట్ లో ఆర్యవైశ్య అన్నప్రసాద సహకారం తో ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ పట్టణ మండల ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మండల మహాసభ అధ్యక్షులు గుబ్బ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో మార్గశిరా అమావాస్య అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్గశిరా అమావాస్య రోజున ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ పట్టణ మండల ఆర్యవైశ్య ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. అదేవిధంగా అమావాస్య నెల రోజున 300 వందల నుండి 400వందల నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం వితరణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో జూలకంటి కృష్ణమూర్తి గుబ్బ రఘురాములు బుద్ధ లక్ష్మి నర్సయ్య గుడాల విరభద్రయ్య కుకూటపు కొండల్ వల్లలా వెంకటేశం అయిత వితాలేషం కూర శ్రీనివాస్ ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్నవారి సహాయం చేయడం మన బాధ్యత

- **మానవత్వం దృక్పథంతో రమేష్ కి రూ. 10వేల రూపాయలు 30 కిలోల సన్న బియ్యం అందజేత**
- **తాజా మాజీ యం పీటీసీ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి**

**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ గ్రామానికి చెందిన తప్పపల్లి రమేష్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, హాస్పటల్ ఖర్చుల నిమిత్తం స్థానిక తాజా మాజీ ఎంపిటిసి, బీఆర్ఎస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కవిత శ్రీనివాస్ రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. రమేష్ కుటుంబానికి ఆర్థిక భారం తగ్గించేందుకు రూ.10,000 నగదుతో పాటు 30 కిలోల సన్న బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్,బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు ,ఉప సర్పంచ్ మచ్చ గణేష్, వార్డుసభ్యులు మంజులా బాలనరసయ్య,బచ్చలి భాస్కర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్,నాయకులు కొంపెల్లి మహేష్,దాచారం కనకయ్య, పుల్లూరి వెంకటయ్య, అలీమ్ శ్రీలత రాంచంద్రం సత్యనారాయణ,ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 58వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**సికింద్రాబాద్, డిసెంబర్ 19 (సిద్ధిపేట పవర్):**

హైదరాబాద్ చుడి బజార్‌లోని కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహం వద్ద ఆయన 58వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రోహిత్ ముదిరాజ్, ముదిరాజ్ జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్‌తో పాటు టి. రవీందర్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, సాయి కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజా వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



- **బస్తి దవాఖానాల్లో డాక్టర్ కుర్చీకి దుమ్ము పట్టింది**
- **బస్తి దవాఖానలకే సుస్తి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **సిద్ధిపేట బస్తి దవఖాన ను ఆకస్మికంగా సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్ధిపేట పవర్ సిద్దిపేటసి డిసెంబర్ 19 :-**



సిద్ధిపేట పట్టణం లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గల బస్తీ దవాఖానను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆకస్మికంగా సందర్శించారు.. ఈ సందర్భంగా బస్తీ దవాఖాన లో ఉన్న స్టాఫ్ నర్స్ తో మాట్లాడారు.. గత ప్రభుత్వం లో సిద్ధి పేట లో 4 చోట్ల బస్తి దవాఖానలు ఏర్పాటు చేసుకున్నామని ఒక్క కెసిఆర్ నగర్ లోని బస్తి దవాఖాన లో మినహాయించి మిగతా మూడు బస్తి దవాఖానలు కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డి పల్లి, ఆర్ అండ్ బి కార్యాలయం సమీపంలో లోన్న వాటిల్లో గత 6 నెలల నుండి డాక్టర్ లు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు.. డాక్టర్ లేక మెడికల్ ఆఫీసర్ రూమ్ పెచ్చులు ఊడిపోయి, డాక్టర్ కూర్చునే కుర్చీలో దుమ్ము పట్టి ఉండటం పట్ల ఇదేనా బస్తి దవాఖాన తీరని, డాక్టర్ లు లేకుండా ప్రజలకు వైద్యం ఎలా అందిస్తారన్నారు.. పేద ప్రజల కోసం బస్తి దవాఖాన లను ఏర్పాటు చేస్తే వాటిని సుస్తి దవాఖాన లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు.. ఒక వైపు 6నెలలు గా డాక్టర్ రావడం లేదని..మరో వైపు ఉన్న అటెండర్ కు మూడు నెలలు గా జీతాలు రావడం లేదు.. ఉన్న స్టాఫ్ నర్స్ కు నవంబర్ నెల జీతం ఇప్పటికి రాలేదని సీరియస్ అయ్యారు.. దవాఖాన మందుల గురించి అడిగి తెల్సుకున్నారు.. మల్టి విటమిన్, లోప్రై మెడ్ ( మోషన్స్ ట్యాబ్లెట్ ), లివో సిట్రిజన్ జలుబు ట్యాబ్లెట్, షుగర్ ట్యాబ్లెట్ మెటఫిన్ తో పాటు ఉండాల్సిన గ్లిమి ఫిరైడ్ 2mg లేవని , అదేవిదంగా చిన్న పిల్లలకు సంబందించిన జింక్ సల్ఫేట్ లేవన్నారు.. డాక్టర్ వస్తా లేడు.. మందులు లేవు.. అలాంటప్పుడు ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతాయని.. పేద ప్రజలకు అందించే ప్రజా వైద్యం పట్ల నిర్లక్ష్యం విడాలని వేంటనే బస్తి దవాఖాన లో వైద్యులను ఏర్పాటు చేయాలనీ సకాలంలో మందుల అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసారు..